పరికిచెరువులో కబ్జాలను అడ్డుకోవాలి


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం, గాజులరామారం, జగద్గిరిగుట్ట ప్రాంతంలోని సర్వే నెంబర్ 348/1లోని పరికిచెరువులో కబ్జాలను అడ్డుకోవాలని, శ్మశానవాటికలు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి.విజేందర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, ఇతర నాయకులు కలెక్టరేట్‌లో ఆయనను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మూసాపేట్, గాజులరామారం సరిహద్దులో ఉన్న పరికిచెరువును పూడ్చి భూకబ్జాదారులు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని, రోడ్లు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. స్పందించిన విజయేందర్‌రెడ్డి విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, ఓరుగంటి క్రిష్ణాగౌడ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 14న చిత్రలేఖనం పోటీలు

నిజాంపేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌లోని సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, స్థిరసిత్త సంస్థలు సంయుక్తంగా ఈనెల 14న మహేంద్రహిల్స్‌లో మహాబోధి బుద్ధవిహార్‌లో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఫౌండర్, డైరెక్టర్ ప్రముఖ నాసికా చిత్రకారుడు సత్యనోళ్ల రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు, 15 ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈనెల 12వ తేదీలోపు ఈ నంబర్లలో 9959971679, 9490437035లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన లాల్‌సాహెబ్ గూడవాసులు

ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తున్నాం: ఎమ్మెల్యే

గాజులరామారం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రతీ బస్తీ, కాలనీల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేశామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని లాల్‌సాహెబ్‌గూడ, డిపోచంపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రజలు మంగళవారం జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి నీటి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే జలమండలి అధికారులతో మాట్లాడి ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు.

ఆదర్శనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

పేట్‌బషీరాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఆదర్శనగర్ కమ్యూనిటీహాల్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 35 ఏళ్ల పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేసినట్లు డాక్టర్ లలిత తెలిపారు. కమ్యూనిటీహాల్లో నిర్వహించిన వైద్య శిబిరంలో మందులను ఆదర్శనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శంకరయ్య మందులను అందజేశారు. కార్యక్రమంలో సిస్టర్ గుణావతి, ఆశా వర్కర్ విజయలక్ష్మి, సరిత, రాణి పాల్గొన్నారు.

'విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు'

నిజాంపేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ తెలిపారు. బాచుపల్లి బీవీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, బాచుపల్లి సీఐ ఉపేందర్‌లతో కలిసి మాదకద్రవ్యాల దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువతపై డ్రగ్స్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, మత్తుకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు.

'కాంగ్రెస్ నుంచి ఫణీంద్రనాయుడు సస్పెన్షన్'

కూకట్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముత్తిరెడ్డి ఫణీంద్రనాయుడిని పార్టీ నుంచి సస్పెన్షన్ చేస్తూ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేపీహెచ్‌బీకాలనీలోని ఫ్లాట్ నెంబర్ 121లోని ఎల్ఐజీ గృహసముదాయం పునఃనిర్మాణం సందర్భంగా సదరు ఫ్లాట్స్ ఓనర్స్‌ను ఫణీంద్రనాయుడు బెదిరించి రూ.1.20 లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయని తెలిపారు. బండి రమేష్ విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో ఫణీంద్రనాయుడిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

'నెల్లుట్ల'కు జ్యోతిష్యరత్న అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న వేణుగోపాలరావు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీకి చెందిన జ్యోతిష్య సిద్ధాంతి నెల్లుట్ల వేణుగోపాలరావుకు జ్యోతిష్యరత్న అవార్డు లభించింది. ఈ మేరకు విశ్వజ్యోతిష్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో హబ్సీగూడలో జరిగిన వైదిక సమ్మేళనంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతిష్య విభాగంలో నెల్లుట్ల సేవలను పలువురు కొనియాడారు. ప్రముఖ జ్యోతిష్య పండితులు దైవజ్ఞశర్మ, పుచ్చా శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీకాంత్‌శర్మ, ఎల్ఎస్ సిద్ధాంతి, పెండ్యాల సూర్యంశర్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలి


మంత్రిని కలిసిన నాగిరెడ్డి, కాంగ్రెస్ నేతలు

ఫతేనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులు అందక పేదలు ఇబ్బంది పడ్డారని, కాంగ్రెస్‌పై పేదల నమ్మకం సన్నగిల్లకముందే అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఏ బ్లాక్ ఇన్‌చార్జి పట్లోళ్ల నాగిరెడ్డి మంత్రికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆయన మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు


మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాగరాజు

హైదర్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా మంగళవారం టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ కార్యదర్శి కర్క నాగరాజు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రేటర్ కార్యదర్శులు సదామహేష్, జక్కుల అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

దుండిగల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం దుండిగల్ పోలీసులకు మంగళవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి బౌరంపేట, ఓంసాయిరామ్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రక్కన చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. పెట్రోల్‌బంక్‌లో పని చేస్తున్న సుధాకర్‌రెడ్డి దుండిగల్ పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వివరాలను పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు కనిపించలేదు. దీంతో దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై వైట్ కలర్ షర్టు, క్రీమ్ కలర్ ఫ్యాంట్ ఉందని, అతడి వివరాలు ఎవరికైనా తెలిస్తే దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ గెస్ట్‌హౌస్

- అక్రమంగా నిర్మించిన కాంగ్రెస్ నాయకుడు
- పట్టించుకోని అధికారులు


ప్రభుత్వ భూమిలో నిర్మించిన గెస్ట్‌హౌస్

నిజాంపేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో భూముల ధరలు అధికంగా ఉండడంతో చోటామోటా నాయకులు సైతం కబ్జాలు చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. కబ్జాదారులపై అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో ఆక్రమణలు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. నిజాంపేట పరిధిలో కాంగ్రెస్ పార్టీ గల్లీస్థాయి నాయకులు కబ్జాలకు తెరతీశారు. పైస్థాయి నాయకుల అండదండలతో ప్రభుత్వ భూములను కబ్జాలు చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు వచ్చి కూల్చివేతలు చేపడుతుంటే బడా నాయకుల నుంచి ఫోన్‌లు చేయిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో వీరి వేధింపులు తట్టుకోలేక అధికారులు దీర్ఘకాలిక సెలవులు పెడుతున్నట్లు తెలుస్తోంది.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్, నిజాంపేట్ గ్రామానికి చెందిన ఓ చిన్న లీడర్ సర్వే నెంబర్ 334లో 250 గజాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి గెస్ట్‌హౌస్ నిర్మించాడు. ఇదేమని ఎవరైనా అడగడానికి వెళితే తనకు కోర్టు ఆర్డర్ ఉందని చెప్పడం, అక్కడికి ఎవరు వస్తున్నారు, ఎవరు వెళతున్నారు అనే వివరాలు తెలియడానికి సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకున్నాడు. ఈ గెస్ట్‌హౌస్ బ్రహ్మంగారి గుట్ట ప్రాంతంలో కనిపిస్తుంది. గెస్ట్‌హౌస్ నిర్మించిన చోటా నాయకుడు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జికి ముఖ్య అనుచరుడిగా తెలుస్తోంది. ఆ నాయకుడి అండదండలతోనే గెస్ట్‌హౌస్ నిర్మించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ అక్రమ నిర్మాణంపై రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి మరి.

రెండు రోజుల్లో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తాం



నిజాంపేట్ గ్రామం, సర్వేనెంబర్ 334లో ఓ కాంగ్రెస్ నాయకుడు అక్రమ నిర్మాణం చేపట్టినట్టు తమ దృష్టికి వచ్చింది. ఆ నిర్మాణాన్ని రెండు రోజుల్లో కూల్చి వేస్తాం. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించం.

- పూల్‌సింగ్, తహసీల్దార్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

ఉపాధ్యాయులకు సన్మానం

గచ్చిబౌలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లు, బదిలీలు సర్వసాధారణమని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. మసీద్‌బండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి, ఉపాధ్యాయులు యాదగిరి బదిలీ కావడంతో వీడ్కోలు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 14 ఏళ్లుగా ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి, ఉపాధ్యాయుడు యాదగిరి పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ అనంతరెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, శేరిలింగంపల్లి మాజీ ఫ్లోర్‌లీడర్ రామస్వామియాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల మేత తయారీ పరిశ్రమలో అగ్నిప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో అంటుకున్న మంటలు


మంటలను అదుపు చేస్తున్న ఫైర్‌సిబ్బంది

జీడిమెట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలోని సుభాష్‌నగర్ పైప్‌లైన్‌రోడ్‌లో ఓ రొయ్యలమేత తయారీ పరిశ్రమలో మంగళవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. శ్రీలక్ష్మీఇండస్ట్రీస్ పేరుతో వెంకటపతిరాజు అనేవ్యక్తి కొంత కాలంగా పరిశ్రమను ఏర్పాటు చేసి రొయ్యలు, చేపలకు మందులు, ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తున్నాడు. మంగళవారం ఉదయం 7.30గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించి కంపెనీలోని నిల్వఉంచిన మెటీరియల్ మొత్తం కాలిపోయింది. ఈ ప్రమాదంలో భారీ ఆస్తినష్టం జరిగింది. స్థానికులు జీడిమెట్ల ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్‌సిబ్బంది, జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. మంటలను సకాలంలో అదుపుచేయడంతో చుట్టు పక్కల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పరిశ్రమలో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులకు గృహిణి ఆత్మహత్య


సల్మాబేగం(ఫైల్)

అల్లాపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌కు చెందిన సల్మాబేగం(26) వరకట్న వేధింపులు తాళలేక మంగళవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన సల్మాబేగం భర్త మహమ్మద్‌గౌస్‌తో కలిసి కొద్ది సంవత్సరాల క్రితం అల్లాపూర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ముఖ్యంగా వరకట్నం కోసం సల్మాబేగంను ఆమె భర్త వేధించేవాడని, వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు అల్లాపూర్ పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కూకట్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. అన్ని డివిజన్ల పరిధిలోని పెండింగ్ పనులను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్‌రెడ్డి, ముద్దం నర్సింహయాదవ్, సతీష్‌గౌడ్, సబీహాబేగం, శిరీష, మందడి శ్రీనివాసరావుపాల్గొన్నారు.

- పనుల్లో వేగం పెంచాలి

కూకట్‌పల్లి డివిజన్ ప్రశాంతినగర్‌లో నిర్మిస్తున్న కల్వర్ట్ నిర్మాణ పనులను జడ్సీ మంగళవారం పరిశీలించారు. వర్షాకాలంలో పెద్దఎత్తున వర్షపునీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో యుద్ధప్రాతిపాదికన పనులు చేపట్టాలని అధికారులను జెడ్సీ ఆదేశించారు.


జడ్సీ అపూర్వ్ చౌహాన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే


మొక్కలను నాటుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మంజుల

మొక్కలు నాటి సంరక్షించాలి

చందానగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీలో వనమహోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ మంజుల, శేరిలింగంపల్లి జోన్ యూబీడీ డైరెక్టర్ అనిల్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో కలిసి వారు మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వనమహోత్సవంలో మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూబీడీ మేనేజర్లు సమీరా, విక్రమ్‌చంద్ర, మాజీ కౌన్సిలర్ రవీందర్‌రావు, చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, గోపి, వెంకటేష్, అక్బర్‌ఖాన్, గుడ్ల ధనలక్ష్మి, వరలక్ష్మి, నరేందర్, యూసుఫ్, హుస్సేన్, ఎల్లయ్య, రాహుల్, సందీప్ పాల్గొన్నారు.

- **కూకట్‌పల్లి:** వివేకానందనగర్‌కాలనీలోని పార్కులో మంగళవారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు.
- **పోలీస్ బెటాలియన్‌లో..**

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని పోలీస్ బెటాలియన్‌లో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. బెటాలియన్‌లో పోలీస్ అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు.

వ్యక్తిపై దాడి కేసులో ఒకరి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు

కూకట్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య మద్యం తాగి గొడవ చేస్తున్న వారిని వారించినందుకు కక్షగట్టి దాడి చేసిన ఘటనలో మంగళవారం ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మూసాపేట్, యాదవబస్తీకి చెందిన అల్యాన హేమరావు అలియాస్ చిన్న, డొల్ల శ్రీశైలంతో కలిసి ఆదివారం రాత్రి 11:30కు ఇళ్ల మధ్యన మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో మూసాపేట్ జనతానగర్‌కు చెందిన కొమరి సురేష్ అలియాస్ ఉదయ్ హేమరావు, శ్రీశైలంను అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించడంతో అతడిపై కక్షగట్టారు. సురేష్‌ను అంతం చేయాలని ప్లాన్ వేసి ఆదివారం రాత్రి సురేష్‌పై దాడి చేసి గాయపరచి పారిపోయారు. బాధితుడి అన్న కొమరి ఉపేందర్ ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి ఎస్సై ప్రేమ్‌సాగర్ కేసు నమోదు చేసుకున్నారు. మంగళవారం ప్రధాన నిందితుడు హేమరావును అరెస్టు చేశారు. డొల్ల శ్రీశైలం పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

మాదాపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ మరోమారు ఉక్కుపాదం మోపుతోంది. మంగళవారం సొసైటీలో అనుమతి లేకుండా చేపట్టిన పదుల సంఖ్యలో నిర్మాణాలను కూల్చివేసింది. పిల్లర్లు, శ్లాబ్‌లు, ప్రారంభ దశలో ఉన్న నిర్మాణాలను నేలమట్టం చేసింది. సొసైటీలో స్థల వివాదం నేపథ్యంలో భవన నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతి ఇవ్వదు. అయినా యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. పనులు జరుగుతున్నపుడు కళ్లు మూసుకునే అధికారులు.. అప్పుడప్పుడు ఇలా కూల్చివేతల పేరిట హడావిడి చేస్తుండడం గమనార్హం.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: ఆమ్రపాలి


గచ్చిబౌలి ఫ్లై ఓవర్ వద్ద పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

గచ్చిబౌలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వెస్ట్‌జోన్ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, ఆస్తులు కోల్పుతున్న ప్రజలకు నష్టపరిహారం చెల్లించే ప్రక్రియ వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. శేరిలింగంపల్లిలో మంగళవారం ఆమె అధికారులతో కలిసి ప్రాజెక్టు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. లింగంపల్లి, మసీద్‌బండ, ఐఐటీ జంక్షన్, గచ్చిబౌలితో పాటు పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. నిర్మాణ పనులకు సంబంధించి ఆస్తులు కోల్పోతున్న వారికి టీడీఆర్, నగదు రూపంలో పరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఆస్తులకు సంబంధించిన కోర్టు కేసులు, వివాదాలు ఉంటే వాటిపై అధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. శేరిలింగంపల్లిలో జరుగుతున్న ఫ్రీలెఫ్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య ఉండకుండా అధికారులు పలు విభాగాలతో సమన్వయం చేసుకుంటూ కూడళ్లను సుందరీకరించాలన్నారు. కొత్త ప్రాజెక్టులను, అవసరమైన వాటికి ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ సూచించారు. మసీద్‌బండ నుంచి గచ్చిబౌలి రోడ్డు వరకు చేపట్టిన విస్తరణ పనులకు సంబంధించి కోర్టు కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ఎస్ఆర్ డీసీపీ దేవానంద్, ప్రాజెక్టు విభాగం అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సాహితీమూర్తులకు స్వరనీరాజనం

రవీంద్రభారతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న సాహితీమూర్తులకు స్వరనీరాజనం పలకడం ఆనందకరమని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీమూర్తులకు స్వరనీరాజనం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గాయనీ గాయకులు శాస్త్రీయ, సినీ గీతాలను ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి గాయనీ గాయకులను సత్కరించి అభినందించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విభిన్నమైన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సాహితీమూర్తులను కీర్తిస్తూ సంగీత విభావరి నిర్వహించాలనే ఆలోచన గొప్పదని, కళలను, కళాకారులను కాపడుకునే ప్రయత్నం జరగాలని పేర్కొన్నారు.

● శీతల పండుగ



కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం శీతల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 కుటుంబాలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గణేష్ నాయక్, నారునాయక్ మంగళవారం తెలిపారు. పంట పొలాలు పసుపు సంపద బాగుండాలని భావిస్తూ ఆరేళ్లుగా శీతల పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

- కేపీహెచ్‌బీకాలనీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి)

ఎంబీసీ చైర్మన్‌ను కలిసిన కార్పొరేటర్


అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన జెరిపేటి జైపాల్‌కు శుభాకాంక్షలు చెబుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, నాయకులు

హైదర్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వెనుకబడిన తరగతుల (ఎంబీసీ) అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా జెరిపేటి జైపాల్ ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు.

90 లీటర్ల కల్తీ వైన్ స్వాధీనం

- తయారు చేస్తున్న మహిళ అరెస్ట్

ముషీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కల్తీ వైన్ తయారు చేస్తున్న ఓ మహిళను ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. 90 లీటర్ల కల్తీ వైన్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ డి. రామకృష్ణ వివరాలు వెల్లడించారు. తార్నాక విజయపురి కాలనీకి చెందిన గెరాల్డిన్ మిల్స్(54) కొంతకాలంగా ఇంట్లో ద్రాక్ష పండ్లు, చక్కెరతో కల్తీవైన్ తయారు చేసి విక్రయిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పోలీసులు ఆమె ఇంట్లో తనిఖీ చేశారు. 112 బాటిళ్లలో నింపిన 90 లీటర్ల కల్తీ వైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. ఆమె గతంలో కూడా కల్తీ వైన్ తయారు చేసి అరెస్ట్ అయిందని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

ఫ్లై ఓవర్ కింద అక్రమ పార్కింగ్‌లను తొలగించేదెప్పుడు?

అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం


బాలానగర్ ఫ్లై ఓవర్ కింద నిలిపిన వాహనాలు

బాలానగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో బాలానగర్ ఫ్లై ఓవర్ కింద అక్రమ పార్కింగ్‌లను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ ప్రాంతం మందుబాబులు, గంజాయి సేవించే ఆకతాయిలకు అడ్డాగా మారిందని గత నెల (జూన్ 8)న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించింది. కేపీహెచ్‌బీలో చేపట్టిన విధంగా రూ.50 లక్షలతో స్మార్ట్ పార్కింగ్‌కు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, ఎన్నికల కోడ్ కారణంగా పని పెండింగ్‌లో పడిందని వెంటనే పనులు మొదలు పెడతామని కూకట్‌పల్లి సర్కిల్ ఈఈ గోవర్ధన్ గౌడ్ వివరణ ఇచ్చి మంగళవారంతో నెల రోజులు పూర్తయినప్పటికీ స్మార్ట్ పార్కింగ్ పనులు మొదలు కావడం లేదు. అక్రమ పార్కింగ్‌లపై అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ పార్కింగ్‌ల విషయంలో అధికారుల ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి కింద ఉన్న అక్రమ పార్కింగ్‌లను వెంటనే తొలగించాలని స్థానికులు, వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.